క్లుప్తంగా

నేడు సుదర్శన, మహాచండీ హోమాలు

తుని రూరల్: పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానం, ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో హోమాలు నిర్వహించనున్నారు. లోవ దేవస్థానంలోని పంచలోహ విగ్రహాల ప్రాంగణంలో తలుపులమ్మ అమ్మవారికి మహాచండీ హోమం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుదర్శన హోమం నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ కోలా భీమేశ్వరరావు తెలిపారు.

నేడు వనదుర్గ అమ్మవారికి చండీ, ప్రత్యంగిర హోమాలు

అన్నవరం: పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం, ప్రత్యంగిర హోమాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు గురువారం తెలిపారు. కాగా శుక్రవారం సందర్భంగా కొండదిగువన తొలిపావంచా వద్ద గల కనకదుర్గ అమ్మవారికి, సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు.

వైఎస్సార్ పాలవెల్లువపై అవగాహన

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పాలవెల్లువ కార్యక్రమంపై పాడిరైతులు, ప్రజాప్రతినిధులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏహెచ్ఓ వి.శ్రీధర్ పాలవెల్లువ పథకం ఉద్దేశం, చేకూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పాడిరైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

శంఖవరం: మండలంలోని మండపం గ్రామంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఓం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ప్రతిఒక్కరూ సమాజసేవలో భాగస్వాములు కావాలని ఓం ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో సుర్ల శ్రీను, నక్కా ప్రసాద్, ప్రసాదుల నాగ వీరబాబు, బర్ల సూర్య చక్రం, నక్కా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రత్తిపాడు: రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదంటూ తీసుకువచ్చిన పోలీసు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకునే హక్కు రాజకీయ పార్టీలకు ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కందిమళ్ల సామ్యేలు, ఎ.రాంబాబు, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ మెడికోవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో సుమారు 600 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మెడికోవర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది వసంత కుమార్, శశిప్రియ, రాజేష్, పి.శ్రవణ్, డీన్ జెడీ వెంకటేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాంబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు గురువారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చినారుల ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్పీ రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

తుని రూరల్: తుని వీరవరపుపేట నుంచి ఎస్.అన్నవరం శివారు కవలపాడు వరకు నిర్మించనున్న రోడ్డుకు వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, పంచాయతీ రాజ్ డీఈ శివాజీరావు గురువారం భూమి పూజ చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కోరిక మేరక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎండీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.69 లక్షలు మంజూరయ్యాయని వైస్ ఎంపీపీ సత్యనాగేశ్వరావు తెలిపారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కవలపాడులో అంతర్గత రహదారులు, కాలువలను ఇప్పటికే అరబిందో ఫార్మా కంపెనీ రూ.1.92 కోట్లతో నిర్మిస్తోందన్నారు. సీఎండీఎఫ్ నిధులతో నిర్మించే మెయిన్‌రోడ్డు పనులు పూర్తయితే గ్రామంలో వందశాతం రహదారులు నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు వంగలపూడి కృష్ణారావు, వంగలపూడి వాసు, సూర్రెడ్డి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలుకు అధిక ప్రాధాన్యం

- మెట్టలో జోరుగా ధాన్యం సేకరణ
- ఇప్పటివరకూ 6179 మెట్రిక్ టన్నులు సేకరించిన అధికారులు
- 94.30 శాతం కోతలు పూర్తి
- ఫిబ్రవరి 15 వరకూ ధాన్యం కొనుగోలు



తొండంగిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న సిబ్బంది



తుని మండలంలో సేకరించిన ధాన్యం నుంచి వచ్చిన బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు జోరుగా సాగుతోంది. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. తుని వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఇప్పటివరకూ 6,179 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్టు అధికారులు తెలిపారు.

15,557 హెక్టార్లలో వరిసాగు

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 15,557 హెక్టార్లలో రైతులు వరిసాగు చేశారు. ఇప్పటివరకు 14,677 హెక్టార్లలో (94.30 శాత) వరికోతలు పూర్తయ్యాయి. 52 రైతు భరోసా కేంద్రాలు ద్వారా అధికారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఫిబ్రవరి 15 వరకూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

చివరి దశలో కోతలు

సబ్ డివిజన్ పరిధిలో వరికోతలు చివరి దశకు చేరుకున్నాయి. కోటనందూరు, రౌతులపూడి మండలాల్లో వంద శాత వరికోతలు పూర్తయ్యాయి. తుని మండలంలో 90 శాతం, తొండంగి మండలంలో 89 శాతం, శంఖవరం మండలంలో 97 శాతం వరికోతలు పూర్తవగా మిగిలిన వరిపైర్లను రైతు కోస్తున్నారు. కోతలు పూర్తయిన మండలాల్లో 50 శాతం పంటను కుప్పలుగా వేశారు. మరో 30 శాతం పంటను నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు ఆర్‌బీకేల ద్వారా మిల్లులకు, ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారు. 20 శాతం వరి పంట పనలపై ఉంది. ఫిబ్రవరి 15 వరకూ ధాన్యం సేకరణ కొనసాగనుండడంతో సంక్రాంతి తర్వాత రైతులు కుప్ప నూర్పిళ్లు చేసే అవకాశం ఉంది. అలాగే మేలు రకాలు సాగు చేసిన రైతులు నిల్వ ఉంచుకుని అధిక ధర లభించినప్పుడు విక్రయించాలని చూస్తున్నారు.

మండలాల వారీగా వివరాలు

మండలం	వరిసాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	పూర్తయిన వరికోతలు (హెక్టార్లలో)	కొనుగోలు కేంద్రాలు (మెట్రిక్ టన్నుల్లో)	సేకరించిన ధాన్యం
తుని	2955	2674	11	410
తొండంగి	5207.50	4642	17	1242
కోటనందూరు	4051	4051	11	2800
రౌతులపూడి	2240	2240	8	817
శంఖవరం	1104	1070	5	910
మొత్తం	15557.50	14677	52	6179

21 రోజుల్లో చెల్లింపులు



రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం 21 రోజుల్లో చెల్లింపులు చేస్తోంది. దళారుల ప్రమేయం లేకుండా ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ చేసున్నారు. ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతుల నుంచి ఫిబ్రవరి 15 వరకూ ధాన్యం కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా గిట్టుబాటు ధర వస్తే బహిరంగ మార్కెట్లో రైతులు విక్రయించుకోవచ్చు.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- కిర్లంపూడిలో లబ్ధిదారులకు కొత్త పింఛన్ల పంపిణీ



కిర్లంపూడిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు



మురారిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ దొరబాబు



ఏలేశ్వరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన గురువారం కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని 455 మందికి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లను ఎమ్మెల్యే పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, తోట గాంధీ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, వైఎంఎస్‌సీ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్ళకుర్తి నాగమణి, సీటి సంఘం డైరెక్టర్ దాడి అప్పలరాజు, ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

గండేపల్లి: మండలంలోని మురారిలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు గురువారం ఎంపీపీ చలగళ్ల దొరబాబు పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కుక్కల ఆనందబాబు, ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ధన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో పేదలకు చేయూత

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ల సొమ్ము పెంచడంతో పాటు కొత్తవి మంజూరు చేసి పేదలకు అండగా నిలుస్తున్నారని మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి అన్నారు. పట్టణంలోని 12 వార్డులో లబ్ధిదారులకు గురువారం వైఎస్సార్ సీపీ నేత సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోరాడ ప్రసాద్, సిరిపురపు రాజేష్, పైల విజయ్, జామి ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి క్రీడా సంబరాలు



తునిలో వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ నాగ దుర్గారావు

తుని: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొదించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్టు తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు తెలిపారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల మైదానంలో గురువారం వాలీబాల్, కబడ్డీ పోటీల ఫైనల్స్ హోరాహోరీగా జరిగాయి. తుని పరిసర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పోటీలకు హాజరయ్యారు. శుక్రవారం ఖోఖో ఫైనల్స్ జరుగుతాయని సీఐ తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకొని యువత అసాంఘిక కార్యక్రమాల వైపు వెళ్ల కుండా ఉండేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం జరిగే క్రీడా పోటీల ముగింపు వేడుకలకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు.

గండేపల్లి: యువతకు సాంప్రదాయ క్రీడలే ముద్దని, చెడు వ్యసనాల బారిన పడవద్దని పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఆర్డీఓ సీతారామారావు సూచించారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్సై వై.గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి క్రీడా సంబరాలను గురువారం వారు ప్రారంభించారు. యువత ఈ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, సర్పంచులు పోకల సుబ్బు, ఉప సర్పంచ్ మద్దిపట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన

ఏలేశ్వరం: ఎన్నో ఏళ్లుగా ఏలేరునది బ్రహ్మణరేవు వద్ద మురుగునీటి సమస్య నెలకొంది. పట్టణంలోని పలువీధుల్లోని మురుగునీరు బ్రహ్మణరేవు మీదుగా ఏలేరునదిలో కలుస్తోంది. దీంతో నదిలో స్నానం చేసే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.40 లక్షలతో డ్రైన్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు డ్రైన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేగల వెంకటరమణ, అలమండ వీరరాఘవస్వామి, పైల శ్రీధర్, బోద చిరంజీవిరావు, అలమండ మధు, గెడ్డం కిరణ్, బూర్లు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



ఏలేశ్వరం భవిత కేంద్రంలో అన్నదానం చేస్తున్న దాతలు



ప్రత్తిపాడులో దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ నూకరాజు

ఏలేశ్వరం: స్థానిక భవితకేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు గురువారం దాతలు అన్నదానం చేశారు. పట్టణానికి చెందిన ఎండీ అధికార్ తన కుమారుడు మహమ్మద్ ఉమర్ ఆలీఖాన్ జ్ఞాపకార్థం దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎండీ మోహిద్దీన్‌ఖాన్, కేంద్రం టీచర్లు సరస్వతీ, వాణీపద్మజ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

ప్రత్తిపాడు: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక పంచాయతీ సిబ్బంది, విభిన్న ప్రతిభావంతులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గురువారం గ్రామ ఉప సర్పంచ్ మదినే నూకరాజు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ సంక్రాంతిని సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జంపన బ్రహ్మగణేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు నల్లమిల్లి నానాజీ, ఉప్పలపు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయం



తుని మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పేదలకు వాకర్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. వాకర్, విశ్రాంతి బ్యాంక్ ఉద్యోగి డీఎస్ మూర్తి తన తల్లి రమణమ్మ జయంతి సందర్భంగా పారిశుధ్య కార్మికులకు చీరలు, పండ్లు సమకూర్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మహిళా పారిశుధ్య కార్మికులకు వాటిని చైర్‌పర్సన్ సుధారాణి పంపిణీ చేశారు. మూర్తి వాకర్‌గా పలు సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, వాకర్స్ ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ, కుందెం సత్యనారాయణ, చోడిశెట్టి బాబూరావు, జూరెడ్డి చిరంజీవి, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



వాకపల్లిలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

ప్రత్తిపాడు రూరల్: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని వాకపల్లి సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని వాకపల్లిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు గురువారం ఆయన పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, రామిశెట్టి బులిరామకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ స్థలంలో ప్రభుత్వ నిధులతో నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకలు పాల్గొన్నారు.

బీమాతో పేదలకు మేలు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ బీమా పథకంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన కంచర్ల బుజ్జమ్మ ఇటీవల మృతి చెందింది. ఆమెకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష మంజూరు కాగా వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి చినబాబు, రామిశెట్టి బులిరామకృష్ణ మృతురాలు తల్లి కంచర్ల నూకమ్మకు గురువారం బీమా సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మామిడి నరసింహమూర్తి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై ఎంవీఆర్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన మధువీటి లక్ష్మీనారాయణ సాయిరాం దేవ్ (56) గత కొంత కాలంగా మోహనాపురం గ్రామంలో వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడులు తిరిగిరాకపోవడంతో డిసెంబర్ 24న ఇంటి వద్దే పురుగు మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య నిమిత్తం రాజమహేంద్రవరంలోనే ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఏలేరు ప్రాజెక్టులోకి చేప పిల్లలు



ఏలేరు ప్రాజెక్టులో చేపపిల్లలను వదులుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు ప్రాజెక్టులోకి గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు చేప పిల్లలను వదిలారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన్‌లో భాగంగా సుమారు 5.50 లక్షల మేలుజాతి చేపపిల్లలకు ఏలేరు ప్రాజెక్టులోకి వదిలారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రాజెక్టులో పెంచుతున్న చేపలతో మత్స్యకారులకు జీవనోపాధి దొరుకుతుందన్నారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కె.శ్రీరామకృష్ణ, పార్టీ నాయకులు తొండారపు రాంబాబు, అలమండ వీరరాఘవస్వామి, పైల శ్రీధర్, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి



తుని 1వ వార్డులో పైపులైన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 1వ వార్డు నెహ్రూ నగర్ రిజర్వాయర్ నుంచి ఆర్టీసీ డిపో వరకూ రూ.4 లక్షలతో చేపట్టిన పైపులైన్ పనులకు గురువారం ఆమె భూమిపూజ చేశారు. గత నెలలో మంత్రి దాడిశెట్టి రాజా ఒకటో వార్డులో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో తాగునీటి సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సచివాలయానికి వచ్చిన రూ.20 లక్షల నిధుల్లో రూ.4 లక్షలు పైపులైన్‌కు కేటాయించారు. పైపు లైన్ ఏర్పాటుతో సుమారు 40 కుటుంబాల తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని చైర్‌పర్సన్ సుధారాణి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్యాజా, వార్డు కౌన్సిలర్లు వారాధి జ్యోతి, చింతల సునీత, ఏఈ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ తనిఖీ



ప్రత్తిపాడు ఎమ్మార్సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి సీఎంఓ నాగేశ్వరరావు

ప్రత్తిపాడు: స్థానిక మండల రీసోర్స్ కేంద్రం, మండల విద్యాశాఖ కార్యాలయాలను జిల్లా సమగ్ర శిక్ష ఐఈ (ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్) కో ఆర్డినేటర్, ఇన్‌చార్జి కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంఓ) చామంతి నాగేశ్వరరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయాల్లోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదులను పర్యవేక్షించి, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని, లెసన్ ప్లాన్లు, టీచింగ్ డైరీలు అందుబాటులో ఉంచుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ వి. రాజబాబు, సీఆర్పీలు గంగారావు, ఇ.రాంజీ ప్రసాద్ పాల్గొన్నారు.

మోటారు సైకిల్ చోరీపై కేసు

గండేపల్లి: మోటార్ సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన రెడ్డి షణ్ముకరావు మండలంలోని జెడ్.రాగంపేటలోని సాయి హాస్పటల్‌కు తన బంధువులను పరామర్శించేందుకు వచ్చారు. హాస్పటల్ బయట మోటార్ సైకిల్ పార్కింగ్ చేసి లోపలకి వెళ్లి వచ్చేసరికి తన మోటార్ సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

లబ్ధిదారులకు రేషన్‌కార్డుల పంపిణీ



దానవాయిపేటలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత

తొండంగి: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత అన్నారు. దానవాయిపేట పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆమె లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులు, వృద్ధులకు పింఛన్లు మత్స్యకారులకు బోటు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోఅన్నివర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మదదా హేమంత్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలి

రౌతులపూడి: ప్రతివిద్యార్థి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ ఎస్వీ నాయుడు సూచించారు. మండలంలోని ఎస్.అగ్రహారం, ఎన్‌వీ నగరం, బీబీ పట్నం గ్రామాల్లో ఎంపీపీ పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎస్–1 పరీక్షలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై ఉపాధ్యాయులను ఆరా తీశారు. ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థి ఆంగ్లంపై పట్టు సాధించాలని సూచించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాస్క్ ధారణపై అవగాహన

తుని: సంక్రాంతి పండగ దగ్గర పడడంతో తుని మార్కెట్‌లో జన సంచారం విపరీతంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ మాస్క్ ధరించాలని అధికారులు కోరుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి సొంత ప్రాంతాలకు వచ్చే వారి వలన కోవిడ్ సోకే అవకాశాలు ఉన్నాయని వైద్య శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనిలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, పట్టణ సీఐ నాగ దుర్గారావు గురువారం మాస్క్ ధారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇప్పటికే తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు అన్ని వ్యాపార సంస్థలకు మాస్క్ తప్పని సరిగా వినియోగించాలని నోటీసులు జారీ చేశారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్న విషయాన్ని అందరూ గమనించాలని ఆయన కోరారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

గండేపల్లి: పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గండేపల్లి శివారులో పేకాడుతున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10, 200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.